# సేవల రంగం కుదేలు

- సెప్టెంబర్‌లో 10 నెలల కనిష్ఠానికి కార్యకలాపాలు
- కొత్తగా లేని వ్యాపారం, అంతర్జాతీయ అమ్మకాలూ పతనం
- హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్



న్యూఢిల్లీ, అక్టోబర్ 4: దేశీయ సేవా రంగ కార్యకలాపాలు గత నెలలో దారుణంగా పడిపోయాయి. సెప్టెంబర్‌లో 10 నెలల కనిష్ఠానికి దిగజారినట్టు శుక్రవారం విడుదలైన హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ నెలవారీ సర్వేలో తేలింది. ఆగస్టులో ఈ సూచీ 60.9గా ఉంటే.. సెప్టెంబర్‌లో 57.7కే పరిమితమైంది. గత ఏడాది నవంబర్ తర్వాత ఈ స్థాయిలో గణాంకాలు పతనం కావడం ఇదే తొలిసారి.

### నీరసించిన వ్యాపారం, అమ్మకాలు

గత నెల కొత్తగా జరిగే వ్యాపార కార్యకలాపాలు బాగా తగ్గుముఖం పట్టాయని, అంతర్జాతీయ అమ్మకాలు సైతం పడిపోయాయని, ఉత్పాదకత కూడా క్షీణించిందని ఈ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ)లో స్పష్టమైంది. అందుకే ఈ ఏడాదిలో మొదటిసారి 60 కంటే తక్కువకు స్కోర్ దిగజారినట్టు హెచ్ఎస్‌బీసీ ఇండియా ప్రధాన ఆర్థికవేత్త ప్రంజుల్ భండారి చెప్పారు. కాగా, మార్కెట్‌లో తీవ్రమైన పోటీ, ధరల ఒత్తిళ్లు, వినియోగదారుల ప్రాధాన్యతలో మార్పులు వంటివి ఇండెక్స్ వృద్ధిలో పతనానికి కారణమైనట్టు ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.

### ప్రమాదంలో తయారీ రంగం

పీఎంఐ తాజా గణాంకాలు భారతీయ తయారీ రంగంలో నెలకొన్న ప్రమాదకర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. దేశంలోకి పెరుగుతున్న దిగుమతుల కారణంగా ఇప్పటికే స్థానికంగా ఉత్పాదకత పడిపోతున్నది. ఇక కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన 'మేక్ ఇన్ ఇండియా'తో ఒనగూరిందేమీ లేదని ఇటీవల విడుదలైన గణాంకాలే తేల్చాయి. ఈ క్రమంలో దిగుమతుల్ని తగ్గించి, ఎగుమతుల్ని పెంచే దిశగా అడుగులు పడకపోతే భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### చైనాతో జాగ్రత్తగా ఉండాల్సిందే

పొరుగు దేశం చైనాతో పెరుగుతున్న వాణిజ్య లోటుపైనా ఇండస్ట్రీ నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో చైనా కంపెనీల వ్యాపార కార్యకలాపాలు చాప కింద నీరులా విస్తరిస్తుండటం ఇప్పుడు భారత ఆర్థిక వ్యవస్థకు పొంచి ఉన్న ప్రధాన ముప్పుగా వారు అభివర్ణిస్తున్నారు. కొన్ని రంగాల్లోకి చైనా కంపెనీల రాకను అడ్డుకుంటున్నప్పటికీ.. ఇతర మార్గాల ద్వారా అక్కడి మూలాలున్న సంస్థలు భారత్‌లోకి ప్రవేశిస్తూనే ఉండటం ఆందోళనకరంగా తయారైంది. దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో చైనా సంస్థలదే హవా అన్న విషయం తెలిసిందే. గృహోపకరణాలు, ఇతర డిజిటల్ పరికరాలు, ఆటో రంగంలోనూ ఆ దేశ ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో దేశీయంగా తయారీ బలపడేలా మోదీ సర్కారు ప్రభావవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తే త్వరితగతిన మెరుగైన ఫలితాలను సాధించవచ్చనీ మెజారిటీ నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుత మందగనం వేళ ఇది చాలా అవసరమని అంటున్నారు.



## నయా మాగ్నైట్

ధర రూ.5.99 లక్షలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్.. దేశీయ మార్కెట్‌కు నయా మాగ్నైట్‌ను పరిచయం చేసింది. ఈ కారు ప్రారంభ ధర ఢిల్లీ ఎక్స్‌షోరూం ప్రకారం రూ.5.99 లక్షలు. తొలి పదివేల బుకింగ్‌లకు మాత్రమే ఈ ధర వర్తించనున్నది. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో తయారైన ఈ మాడల్ లీటర్‌కు 20 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. ఆటోమేటిక్ మాడల్ 17.4 కిలోమీటర్లు మైలేజీ. భారత్‌లో వ్యాపార విస్తరణ కోసం మరో 100 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టబోతున్నట్లు నిస్సాన్ ఇండియా ప్రకటించింది. ఇప్పటికే సంస్థ 600 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టింది.

# ఐదోరోజూ అదే తీరు

- భారీ నష్టాల్లోనే స్టాక్ మార్కెట్లు
- సెన్సెక్స్ 809, నిఫ్టీ 235 పాయింట్లు క్షీణత

ముంబై, అక్టోబర్ 4: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలు కొనసాగుతున్నాయి. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతుండటం, విదేశీ మదుపరులు భారీగా నిధులను ఉపసంహరించుకోవడంతో వరుసగా ఐదో రోజూ భారీగా నష్టపోయాయి. నష్టాల ప్రారంభమైన సూచీలు చివరివరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఎఫ్ఎంసీజీ, ఎనర్జీ రంగ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో వారాంతం ట్రేడింగ్‌లో 30 షేర్ల ఇండెక్స్ సూచీ 800 పాయింట్లకు పైగా నష్టపోయింది 1,835.63 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్ చివరకు 808.65 పాయింట్లు కోల్పోయి మూడు వారాల కనిష్ఠస్థాయి 81,688.45 వద్దకు పడిపోయింది. అటు ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 235.50 పాయింట్లు జారుకొని 25,014.60 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25 వేల పాయింట్ల దిగువకు పడిపోయిన సూచీ చివర్లో ఈ భారీ నష్టాలను తగ్గించుకోగలిగింది.



5 రోజులు..16 లక్షల కోట్లు

సూచీల భారీ నష్టాలు మదుపరులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. గత ఐదు రోజుల్లో ఏకంగా మదుపరులు రూ.16 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. గతంలో రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ అంతే వేగంతో పాతాళంలోకి జారుకున్నది. ఇదే క్రమంలో శుక్రవారం బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.16,26,691.48 కోట్లు కరిగిపోయి రూ.4,60,89,598.54 కోట్ల(5.49 ట్రిలియన్ డాలర్లు)కు జారుకున్నది. గత ఐదు రోజుల్లో సెన్సెక్స్ 4,147.67 పాయింట్లు లేదా 4.83 శాతం నష్టపోయింది.

- రియల్టీ రంగ సూచీ 1.60 శాతం, వాహన 1.50 శాతం, టెలికమ్యూనికేషన్ 1.25 శాతం, యుటిలిటీ 1.20 శాతం, కమోడిటీస్ 1.14 శాతం మేర నష్టపోయాయి. కానీ, ఐటీ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఈవారంలో సెన్సెక్స్ 3,883.40 పాయింట్లు(4.60 శాతం), నిఫ్టీ 1,164.35 పాయింట్లు(4.5 శాతం) నష్టపోయింది. గత రెండేండ్లలో ఒక్క వారంలో ఇంతటి స్థాయిలో పతనం చెందడం ఇదే తొలిసారి.
- మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 4 శాతం వరకు నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- దీంతోపాటు బజాజ్ ఫైనాన్స్, నెస్లె, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, భారతీఎయిర్‌టెల్, ఐటీసీ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్‌టీపీసీలు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి.
- అదానీ పోర్ట్స్, కొటక్ బ్యాంక్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, మారుతి, టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎల్అండ్‌టీ, సన్‌ఫార్మా, టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు పతనం చెందాయి.

## యాపిల్ మరో 4 స్టోర్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: దేశవ్యాప్తంగా ఐఫోన్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మరో నాలుగు స్టోర్లు ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది యాపిల్ సంస్థ. పుణె, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైలలో కొత్త స్టోర్లను నెలకొల్పనున్నట్లు యాపిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డియర్‌డ్రి ఓబ్రియాన్ తెలిపారు. దీంతోపాటు దేశీయంగా తయారైన ఐఫోన్ 16, ఐఫోన్ 16 ప్రొ మ్యాక్స్ సిరీస్ ఫోన్లను ఈ నెలలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. 2023లో సంస్థ ఢిల్లీ, ముంబైలలో ఒక్కో స్టోర్‌ను ప్రారంభించింది.

## సైయెంట్ డీఎల్‌ఎం చేతికి అమెరికా సంస్థ

హైదరాబాద్, అక్టోబర్ 4: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న సైయెంట్ డీఎల్‌ఎం..అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా అమెరికాకు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీదారు అల్టెక్ ఎలక్ట్రానిక్‌సను కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ 29 మిలియన్ డాలర్లు(రూ.250 కోట్లకు పైమాటే). 2023లో అల్టెక్ ఎలక్ట్రానిక్స్ 37.2 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా ఈ కొనుగోలు జరిపినట్లు, ముఖ్యంగా క్లయింట్లకు నూతన సేవలు అందించడానికి వీలు పడనున్నదని పేర్కొంది. ఈ కొనుగోలు పూర్తైన తర్వాత సంస్థ పరిధిలోకి కొత్తగా 80 వేలచదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన తయారీ ప్లాంట్ చేరనున్నది.

## స్విగ్గీ స్పీడ్ సర్వీస్ 'బోల్ట్'


న్యూఢిల్లీ, అక్టోబర్ 4: ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ.. కస్టమర్లకు కేవలం 10 నిమిషాల్లోనే సర్వీస్‌ను అందించేలా 'బోల్ట్' పేరిట ఓ స్పీడ్ ఫుడ్ డెలివరీ సర్వీస్‌ను ప్రారంభించింది. వినియోగదారులకు 2 కిలోమీటర్ల వ్యవధిలో ఉన్న కొన్ని ఎంపిక చేసిన రెస్టారెంట్లలో చేసే ఆర్డర్లకే ఈ సౌకర్యం ఉంటుందని శుక్రవారం సంస్థ ప్రకటించింది. కాగా, రాబోయే వారాల్లో మరిన్ని నగరాలకు ఫుడ్ డెలివరీ సేవలను విస్తరించాలని స్విగ్గీ చూస్తున్నది.



శుక్రవారం ముంబైలో బీఎండబ్ల్యూ లగ్జరీ స్పోర్ట్స్ కార్ మాడల్ ఎం4 సీఎస్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేస్తున్న ఆ కంపెనీ భారతీయ విభాగం అధ్యక్షుడు విక్రమ్ పవా. ఈ ఏడాది బీఎండబ్ల్యూ తెచ్చిన 25వ మాడల్ ఇది. దీని ధర రూ.1.89 కోట్లు.

# పసిడికి పండుగ కళ

- చారిత్రక గరిష్ఠ స్థాయికి ధరలు
- తులం రూ.78,450గా నమోదు



న్యూఢిల్లీ, అక్టోబర్ 4: బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ హైకి చేరాయి. పండుగ సీజన్ కావడంతో అంతా పసిడి కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నట్టు మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో తులం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పుత్తడి రేటు శుక్రవారం మునుపెన్నడూ లేని విధంగా రూ.78,450గా నమోదైంది. గురువారం ముగింపుతో పోల్చితే రూ.150 పెరిగింది. హైదరాబాద్‌లో ఇది రూ.77,670గా ఉన్నది. ఇక 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) గోల్డ్ 10 గ్రాముల విలువ కూడా రూ.200 ఎగిసి ఇంతకుముందెప్పుడూ లేనట్టుగా భౌతిక మార్కెట్‌లో రూ.78,100కి చేరింది. మొత్తానికి నవరాత్రుల సందర్భంగా గోల్డ్ మార్కెట్ కోలాహలంగా మారడం బులియన్ ట్రేడర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నది.

### రూ.80,000 దిశగా..

జ్యుయెల్లర్స్, రిటైలర్ల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ కనిపిస్తుండటంతో రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. ఈ నెలాఖరున దీపావళి కూడా ఉండటంతో పసిడి 10 గ్రాములు 80,000 మార్కును తాకే అవకాశాలే ఎక్కువని అంటున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా స్టాక్ మార్కెట్లు ఇంకా పడిపోతే ఇన్వెస్టర్ల నుంచీ ఆదరణ పెరుగుతుందని చెప్తున్నారు. ఇదే జరిగితే గోల్డ్ రేట్లు ఊహకందని స్థాయిలో ఈ నెల రోజుల్లోనే పెరిగిపోతాయన్న విశ్లేషణలూ వస్తుండటం గమనార్హం.

### వెండి రేట్లూ పైపైకి..

బంగారం ధరలకుతోడు వెండి రేట్లూ పరుగులు పెడుతున్నాయి. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.1,035 ఎగిసి రూ.94,200గా ఉన్నట్టు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. హైదరాబాద్‌లో లక్షపైనే పలుకుతుండటం గమనార్హం. సాధారణ కొనుగోలుదారులతోపాటు ఇన్వెస్టర్లు, ఇండస్ట్రీ వర్గాల నుంచి డిమాండ్ ఎక్కువగా కనిపిస్తున్నట్టు వ్యాపారులు చెప్తున్నారు. ఇదిలావుంటే మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)పై ఫ్యూచర్స్ ట్రేడ్‌లో డిసెంబర్ నెల డెలివరీకిగాను గోల్డ్ కాంట్రాక్ట్స్ 10 గ్రాములు రూ.76,375 పలికింది. కిలో వెండి కూడా రూ.93,197గా నమోదైంది. ఇక గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 2,678.90 డాలర్లు, సిల్వర్ 32.37 డాలర్లుగా ట్రేడ్ అవుతున్నది.

## మార్కెట్లోకి లావా అగ్నీ 3 స్మార్ట్‌ఫోన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: దేశీయ మొబైల్ తయారీ సంస్థ లావా ఇంటర్నేషనల్..అగ్నీ 3 స్మార్ట్‌ఫోన్‌ను పరిచయం చేసింది. రూ.19,999 నుంచి రూ.22,999 ధరల శ్రేణిలో ఈ స్మార్ట్‌ఫోన్ లభించనున్నది. మీడియా టెక్ డిమెన్సిటీ 7300 ఎక్స్ ఆక్టా-కోర్ ప్రాసెసర్, డ్యూయల్ స్క్రీన్, ట్రాక్ స్టెప్స్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా కంపెనీ ఈడీ సునీల్ రైనా మాట్లాడుతూ..రూ.20-25 వేల స్మార్ట్‌ఫోన్ల విభాగంలో 10 శాతం మార్కెట్ వాటా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.